సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



పెరుగుతున్న ఉష్ణోగ్రతలు 8లో

జిల్లా వ్యాప్తంగా పొగమంచు అర్ధరాత్రి నుంచి ఉదయం 9గంటల వరకు దట్టంగా కురుస్తోంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.



మహిళా సంక్షేమమే ధ్యేయం

మహిళా సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. 8లో



పకడ్బందీగా 'భోజన పథకం' నిర్వహణ 8లో

మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని విద్యా కమిషన్ డైరెక్టర్ శోభిక ఆదేశించారు.

సీఎం జగన్ పర్యటనకు ఏర్పాట్లు

- ఆడుదాం–ఆంధ్రా ముగింపు వేడుకలకు హాజరు కానున్న ముఖ్యమంత్రి
- వైఎస్సార్ క్రికెట్ స్టేడియాన్ని పరిశీలించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న
- ఏర్పాట్లపై కలెక్టర్, శాప్ ఎండీతో సమీక్ష



ఏర్పాట్లపై చర్చిస్తున్న ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న, కలెక్టర్ మల్లికార్జున

విశాఖ స్పోర్ట్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 13న విశాఖలో పర్యటించనున్నారు. పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్న ఆడుదాం–ఆంధ్రా రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకలకు ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, శాప్ ఎండీ ధ్యాన్‌చంద్ర శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం స్టేడియంలోకి రాక, క్రీడాకారులతో ఫొటోలు, ప్రజలతో మమేకం, అభివాదం తదితర కార్యక్రమాల నిర్వహణపై సంబంధిత అధికారులతో చర్చించారు. సీఎం వైఎస్ జగన్ 13వ తేదీ సాయంత్రం స్టేడియానికి చేరుకుని ముందుగా లోపల ఓపెన్ టాప్ వాహనంపై తిరుగుతూ ప్రజలకు అభివాదం చేస్తారని, అనంతరం కామెంటేటర్ రూంకు చేరుకుంటారని ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న కలెక్టర్‌కు తెలియజేశారు. తుది ఆట ముగిసిన వెంటనే స్టేడియం లోపల లేజర్ షో ఉంటుందని, అనంతరం సీఎం క్రీడాకారులను, ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధాన వేదిక వద్ద ఏర్పాట్లను రహదారి భవనాల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ మల్లికార్జున పలు సూచనలు చేశారు. విద్యుత్, పోలీసు శాఖ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని, సామాన్య ప్రజానీకం వచ్చి ఆటలను ఆస్వాదించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్టేడియంలోకి ఆ రోజు సుమారు 25 వేల మందికి పైగా ప్రజలు వస్తారని అంచనా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ–1 మణికంఠ, రహదారులు భవనాలు, విద్యుత్, అగ్నిమాపక శాఖ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

క్రీడా జోష్





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి రోజా, వేదికపై మాట్లాడుతున్న రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

- ఆడుదాం ఆంధ్రా తుది దశ పోటీలు
- ప్రారంభించిన పర్యాటకశాఖ మంత్రి రోజా
- క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయం : బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

విశాఖ స్పోర్ట్స్: మహా క్రీడా సంబరంతో విశాఖ మురిసిపోయింది. గ్రామీణస్థాయి నుంచి యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రారంభించిన మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్రా' తుది ఘట్టానికి విశాఖ వేదికైంది. నాలుగు దశల్లో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలకు విశేష స్పందన రాగా.. జిల్లా స్థాయిలో సత్తా చాటిన జట్లతో రాష్ట్ర స్థాయి పోటీలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం విశాఖ రైల్వే స్టేడియంలో ప్రారంభించారు. ఈనెల 13వ తేదీ వరకు మహా సంగ్రామం జరగనుంది. 13న ముగింపు వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈసందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ చరిత్రలో మనకంటూ ఒక పేజీ ఉండాలంటే ఇదే చక్కటి సందర్భం అన్నారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రోత్సహించడానికి ఆడుదాం ఆంధ్రా ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ



క్రీడా పోటీలకు హాజరైన రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన జట్లు



సర్వీసు చేస్తున్న వాలీబాల్ క్రీడాకారిణి



విశాఖ కలెక్టర్ మల్లికార్జునతో సెల్ఫీ

పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణనిచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. తొలుత రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ వీసీఎండీ టాలెంట్ హంట్‌లో భాగంగానే ఈ పోటీలు అన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న మాట్లాడుతూ క్రీడాకారులు పోటీతత్వం అలవర్చుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ విశాఖ వేదికగా రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం నగరం చేసుకున్న అదృష్టమన్నారు. భారత్ క్రికెట్ జట్టు వికెట్ కీపర్, స్థానికుడు కేఎస్ భరత్ మాట్లాడుతూ కష్టపడితే ఫలితం దక్కుతుందని అన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన 26 జిల్లాలకు చెందిన మెన్, వుమెన్ జట్ల చేత అతిథులు క్రీడాప్రతిజ్ఞ చేయించారు. తొలుత రైల్వే స్టేడియంలోని వేదిక వద్ద శాప్ పతాకాన్ని ఆ సంస్థ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, జాతీయ పతాకాన్ని మంత్రి రోజా ఆవిష్కరించగా అతిథులు గౌరవవందనం సమర్పించారు. పోటీలను ప్రారంభిస్తున్నట్టు మంత్రి ప్రకటించి గాల్లోకి బెలూన్లను విడిచారు. అనంతరం అతిథులు క్రీడాకారుల్ని పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఏడీసీ కేఎస్ విశ్వనాథన్, ఇతర రాజకీయ ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.



మస్కట్‌తో సెల్ఫీలు తీసుకుంటున్న ఆటగాళ్లు

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

పాడేరు : విద్యార్థులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి అల్బెండజోల్ మాత్రలు వాడటం ద్వారా పొట్టలో నులి పురుగులను నివారించడమే కాకుండా రక్తహీనతను అధిగమించవచ్చని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్ సాధన సూచించారు. జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తలార్‌సింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం సుమారు 540 మంది విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులి పురుగులు పొట్టలో చేరకుండా ఉండాలంటే భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం రీమలి జాన్, హెల్త్ అసిస్టెంట్ శెట్టి నాగరాజు, ఆశా వర్కర్ ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

98 శాతం మేర ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

జిల్లా వ్యాప్తంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు (ఆల్బెండజోల్) మాత్రలను వైద్య సిబ్బంది మింగించారు. జాతీయ నులిపురుగల నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వారికి మాత్రలు పంపిణీ చేశారు. జిల్లాలోని 22 మండలాల్లో 3,55,055 విద్యార్థుల్లో 98 శాతం మేర మాత్రలు వేయించామని ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ కిశోర్ తెలిపారు. మిగిలిన విద్యార్థులతో ఈనెల 16న మాత్రలు మింగిస్తామని ఆయన పేర్కొన్నారు.



తలార్‌సింగిలో నులిపురుగుల మాత్రలను మింగిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో సాధన

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- ఎన్నికల అధికారులు, సిబ్బందితో సమీక్ష

రంపచోడవరం: రానున్న సార్వత్రిక ఎన్నిలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే కాకుండా భవన మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులతో ఆయన ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ బూత్‌స్థాయి అధికారులు ఓటర్లకు సంబంధించిన ఫారం–6, ఫారం–8 పెండింగ్‌లో లేకుండా సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది రిటర్నింగ్ అధికారి కంట్రోల్‌లో ఉండాలని తెలిపారు. ఓటరు జాబితాలో చేర్పులు,మార్పుల లిస్టులను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా అధికారులకు నివేదికలు సమర్పించాలని సూచించారు. ఓటరు జాబితాల నుంచి ఎవరి పేరైన తొలగిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఓటరు లిస్టుకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా బాధ్యతగా పని చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ సమయంలో ప్రతి గంటకు కంట్రోల్ రూమ్‌కు సమాచారం తెలపాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది రాజకీయ నాయకులతో ఉండకూడదన్నారు. సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. మారేడుమిల్లి మండలం జీఎం వలస గ్రామానికి చెందిన వికలాంగుడు ముట్టెం శివశంకర్ వరప్రసాద్‌దొర పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కొయ్యూరు: పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్, పాడేరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి భావన వశిష్ట తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్వోలు, సెక్టార్ అధికారులతో సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. వారి పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి నివేదించాలని సూచించారు. ఈ విషయంలో జాప్యం తగదన్నారు. బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్ డి. రాజేశ్వరరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేషన్ బియ్యం పంపిణీలో జాప్యం తగదు

- జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ



బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ

కొయ్యూరు: బియ్యం తరలింపు, పంపిణీలో జాప్యం చేయరాదని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ సూచించారు. శుక్రవారం ఆమె బియ్యం పంపిణీ చేస్తున్న మొబైల్ యూనిట్‌ను పరిశీలించారు. పంపిణీ వివరాలను ఆపరేటర్ సత్తిబాబు నుంచి తెలుసుకున్నారు. పంపిణీలో జాప్యం లేకుండా చూడాలని ఆయన సూచించారు. అనంతరం ఆమె లబ్ధిదారులతో మాట్లాడారు. రేషన్ పంపిణీ సమాచారం తెలుసుకున్నారు. తహసీల్దార్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

తమ్ముడిని హతమార్చిన అన్న

- భూ తగాదాలే కారణం
- ముమ్మరంగా పోలీసుల దర్యాప్తు



దేవదాసు మృతదేహం

చింతపల్లి రూరల్: ఆస్తి తగాదా నేపథ్యంలో తమ్ముడిని అన్న హతమార్చిన ఘటన మండలంలోని బెన్నవరంలో చోటుచేసు కుంది. ఇందుకు సంబంధించి చింతపల్లి సీఐ రమేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బెన్నవరం గ్రామానికి చెందిన పాంగి పెద్ద సన్యాసికి పాంగి రాందాసు, పాంగి దేవదాసు (55) కుమారులు ఉన్నారు. వీరికి సుమారు 20 ఏళ్ల క్రితం పది ఎకరాల భూమిని సమానంగా పంచారు. అప్పటినుంచి వారు సాగు చేసుకుంటున్నారు. ఈనేపథ్యంలో దేవదాసు వాటాలో కొంత భూమి ఇవ్వాలని అన్న రాందాసు అడిగాడు. ఈ విషయమై అన్నదమ్ములిద్దరు పలుసార్లు గొడవ పడ్డారు. ఇదే క్రమంలో గురువారం మళ్లీ గొడవ పడిన సందర్భంలో తమ్ముడు దేవదాసు ఛాతిపై రాందాసు కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన అతనిని లోతుగెడ్డ పీహెచ్‌సీకి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు సీఐ తెలిపారు. ఈమేరకు అన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

హక్కుల పరిరక్షణకు సమష్టి ఉద్యమం

ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర

అరకులోయ రూరల్: ఆదివాసీల హక్కుల పరిరక్షణకు అందరూ సమష్టిగా ఉద్యమించాలని జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావుదొర పిలుపునిచ్చారు. మండల కేంద్రం అరకులోయలో శుక్రవారం ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు పొంది గిరిజనులుగా చలామణి అవుతూ ఆదివాసీ హక్కులు, చట్టాలను కాలరాస్తున్నరన్నారు. అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయతీ బంగ్లవలసలో ఒడిశాకు చెందిన కార్తిక అనే ఇంటిపేరుతో రాజాకిరణ్, అతని కుటుంబ సభ్యులు నూకదొర పేరుతో ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు పొంది గిరిజనులుగా చలమణి అవుతున్నారని ఆరోపించారు. అరకులోయ, యండపల్లివలస, పప్పుడువలస, కొత్తవలస గ్రామాల్లో గిరిజనేతరులు నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు పొంది రాజ్యమేలుతున్నారన్నారు. ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నకిలీ ధ్రువపత్రాలపై విచారణ జరిపి రద్దు చేయడమే కాకుండా గిరిజన ప్రాంతంలో 1/70, పీసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆయన కోరారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. మండల కన్వీనర్ గోపాలరావు, కో–కన్వీనర్లు మహదేవ్, ఆనంద్, నాయకులు బుద్ధు, కామేశ్వరరావు, రాంచందర్, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.



అరకులోయలో ర్యాలీ చేస్తున్న ఆదివాసీ ప్రజా సంఘాలు

పోరాటాలతోనే హక్కుల సాధన

ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

అనంతగిరి: ఆదివాసీల పోరాటాలతోనే హక్కులు సాధించగలిగామని ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు అన్నారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన బొర్రా సచివాలయం వద్ద గిరిజనులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామ తీర్మానాలు లేకుండా నిర్ణయాలు చట్ట విరుద్ధమన్నారు. గిరిజనులు హక్కులు చట్టాలను, కాపాడేందుకు ఎస్టీ కమిషన్ ఉందన్నారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

చట్టాలకు వ్యతిరేకంగా జిప్‌లైన్ నిర్వహణ

బొర్రాగుహల వద్ద జిప్‌లైన్‌ను గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారని స్థానిక గైడ్స్ యూనియన్ కార్మికులు, ఎంపీటీసీ అరుణ తదితరులు ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు దృష్టికి తీసుకువెళ్లారు. వీరంతా గతంలో ఆయనకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం బొర్రా పంచాయతీలో ఆయన పర్యటించారు. గుహలను అనుకుని వీఎస్‌ఎస్ పరిధిలోని అటవీశాఖకు చెందిన 2.3 ఎకరాలను పర్యాటకశాఖ ద్వారా అడ్వంచర్ పార్కు పేరుతో ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేందుకు చూస్తున్నారని వారు వివరించారు. బొర్రాగుహలు మీదుగానే రెండో రైల్వేలైన్ వేసేందుకు ఆశాఖ పరిశీలిస్తోందన్నారు. దీంతో బొర్రాగుహలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. దీనిపై ఆధారపడి వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, బొర్రా గుహలకు నష్టం జరిగితే వీరంతా రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. జిప్‌లైన్, అడ్వంచర్ పార్కును పర్యాటకశా, ఐటీడీఏలు నిర్వహించాలని వారు విన్నవించారు. ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి, ఎంపీపీ శెట్టి నీలవేణి, సర్పంచ్ అప్పారావు, ఎంపీడీవో శ్రీహర్షిత్, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎస్‌ఐ రాము, మండల ప్రధాన కార్యదర్శి దాని యేలు, నవీన్, సమత రవి పాల్గొన్నారు.



స్థానికుల నుంచి వినతులను స్వీకరిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు



టోకూరు పాఠశాలలో మొక్కనాటుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

అనంతగిరి: మండలంలోని టోకూరు గిరిజ సంక్షేమ బాలికల పాఠశాలను శుక్రవారం ఎస్టీకమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు సందర్శించారు. ముందుగా పాఠశాల ఆవరణంలోని మొక్కలను నాటారు. అనంతరం నాడు–నేడు అభివృద్ధి జరిగిన పాఠశాల పనులను పరిశీలించి, విద్యార్థినిలతో మమేకమయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని, చదువుకోవాలన్నారు. చదువుతోనే విద్యార్థినిలకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందన్నారు. నులిపురుగుల నివారణకు సంబంధించి విద్యార్థినిలకు అల్బెండజల్ మాత్రలను అందజేశారు. సర్పంచ్ మోస్య, డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో వెంకటరమణ, ఎంఈవో బాలజీ, ఎస్‌ఐ కరక రాము పాల్గొన్నారు.

క్రీడల్లో ఉన్నతస్థాయికి ఎదగాలి



జి.మాడుగులలో వాలీబాల్ క్రీడాకారులతో పాడేరు ఏఎస్పీ ధీరజ్



డేగలరాయి జట్టుకు షీల్డు, వాలీబాల్ నెట్‌ను అందజేస్తున్న పాడేరు ఏఎస్పీ ధీరజ్



విజేతగా నిలిచిన కుమడ జట్టుతో పోలీసు ఉన్నతాధికారులు

పాడేరు ఏఎస్పీ ధీరజ్, సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భగత్ సింగ్

జి.మాడుగుల: ఏజెన్సీ ప్రాంతంలో యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించి ఉన్నతస్థాయికి ఎదగాలని పాడేరు ఏఎస్పీ ధీరజ్, సీఆర్‌పీఎఫ్ 198 బీఎన్ డిప్యూటీ కమాండెంట్ భగత్ సింగ్ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వాలీబాల్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ గిరిజన యువత చెడు వ్యసనాలు, గంజాయి సాగు, రవాణా, మద్యపానం, సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు ప్రజలు, యువత దూరంగా ఉండాలని ఆయన సూచించారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, స్థైర్యాన్ని ఇస్తాయన్నారు. గ్రామాల్లో సమస్యలు, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వాలీబాల్ టోర్నీలో డేగరాయి జట్టు ప్రథమ, బూసిపల్లి జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. వారికి షీల్డులు, వాలీబాల్ నెట్‌లు, టీషర్టులను ఏఎస్పీ, సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండర్ అందజేశారు. క్రీడల్లో పాల్గొన్న జట్లుకు కూడా వీటిని పంపిణీ చేశారు. టోర్నీలో ఆరు జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్‌ఐ శ్రీనివాస్, సీఆర్‌పీఎఫ్ ఇన్‌చార్జి రవికుమార్, ఏపీఎస్పీ ఆర్‌ఐ పద్మలోచలన, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

పెదబయలు: గిరిజన యువత అన్ని రంగాల్లో రాణించాలని రూడకోట సీఆర్‌పీఎఫ్ ఔట్ పోస్టు 198 బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ భగత్ సింగ్, డీఎస్పీ త్రిలోచన బేరా సూచించారు. శుక్రవారం రూడకోటలో నిర్వహించిన పోటీలను వారు ప్రారంభించారు. క్రీడాకారులతో మాట్లాడారు. గిరిజనుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన ఆరు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. కుమడ జట్టు ప్రథమ, కాంగ్రంగివలస జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. క్రీడాకారులకు ట్రోఫీ, వాలీబాల్ నెట్లు, టీషర్టులు అందించారు. ఇన్‌స్పెక్టర్ ఏకే మిశ్రా, ఎస్‌ఐ మనోజ్‌కుమార్, రూడకోట పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కిశోర్, సత్యారావు, మాజీ సర్పంచ్ పండా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతి పరిరక్షణకు కృషి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ
- చింతూరులో ఘనంగా రేల పండగ ప్రారంభం

చింతూరు: భావితరాలకు అందించడంలో భాగంగా ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ అన్నారు. ఐదవ జాతీయ ఆదివాసీ సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా నిర్వహిస్తున్న రేలపండుగ శుక్రవారం చింతూరులో అత్యంత కోలాహలంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల జీవనశైలి, జీవనవిధానం, సంస్కృతి, సంప్రదాయాల ఆధారంగా వేదాలు, పురాణాలు, గ్రంథాలు వెలిశాయన్నారు. నేటి నాగరికతలో నేటికీ చెక్కు చెదరనది ఆదివాసీ జీవనవిధానం మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ఆదివాసీ సంస్కృతి, గొప్పతనం, తెగల ఐక్యతకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ తలపెట్టిన చారిత్రాత్మక వేదిక రేలపండుగని ఆయన పేర్కొన్నారు. ఆదివాసీ కులదేవతల పూజలతో ప్రారంభమైన రేలపండుగలో భాగంగా పలు రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ నృత్యాలను ప్రదర్శించారు. తెలంగాణలోని ఆదిలాబాద్‌కు చెందిన గుస్సాడీ, వికారాబాద్‌కు చెందిన చెంచు, ఒడిశాకు చెందిన కొమ్ము కోయ నృత్యాలు ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా కోయత్తోర్‌బాట ఆధ్వర్యంలో రూపొందించిన కోయ బాల సాహిత్యాన్ని కూడా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి చింతూరు, వీఆర్‌పురం, కూనవరం, ఎటపాక మండలాలకు చెందిన ఆదివాసీలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూసం శ్రీను, టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కణితి రామకృష్ణ, ప్రచార కార్యదర్శి సోడె మురళి, తిమ్మ వెంకటసాయి, సోడె నారాయణ, సావిత్రితో పాటు ఆదివాసీ పూజారులు, పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సున్నం వెంకటరమణ



గుస్సాడీ నృత్యం చేస్తున్న ఆదిలాబాద్ కళాకారులు

క్లుప్తంగా

పెట్రోల్ బంకు సిబ్బందికి డ్రైవర్ టోకరా

సీలేరు: స్థానిక పెట్రోల్ బంక్ సిబ్బందికి టోకరా కొట్టి ఓ డ్రైవర్ పరారైయ్యారు.. సిబ్బంది తెలిపిన సమాచారం ప్రకారం... భద్రాచలం నుంచి సీలేరు మీదుగా ఒడిశా వెళుతున్న ఓ కారు డ్రైవర్ శుక్రవారం సాయంత్రం పెట్రోల్ బంక్‌కు వచ్చి రూ. 4వేల డీజిల్ పోయించుకున్నాడు. డబ్బులు లేవు డిజిటల్ పేమెంట్ చేస్తామని చెప్పాడు. దీంతో సిబ్బంది ఆఫీస్ రూమ్‌కు వెళ్లి, స్వైపింగ్ మిషన్ తెచ్చేలోగా కారుతో పరారయ్యాడు. దీంతో సిబ్బంది పోలీసులను ఫిర్యాదు చేశారు.

10 కిలోల గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్టు


గంజాయి నిందితులతో పోలీసులు

రంపచోడవరం: మోతుగూడెం చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సీలేరు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న పది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు మోతుగూడెం ఎస్‌ఐ ఎస్.గోపాలరావు తెలిపారు. గంజాయితో పాటు హైదరాబాద్‌కు చెందిన జి.కళ్యాణ్‌కుమార్, కె.నాగేంద్ర అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఒక స్కూటీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇద్దరు వ్యక్తులు హైదరాబాద్‌లో జొమాటో సర్వీస్ బాయ్సుగా, ఒలా క్యాబ్ డ్రైవర్స్‌గా పనిచేస్తున్నట్టు చెప్పారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలిస్తున్నట్టు తెలిపారు.

పకడ్బందీగా 'భోజన పథకం' నిర్వహణ

- నిర్లక్ష్యం చేస్తే చర్యలు
- పాఠశాల విద్యా కమిషన్ డైరెక్టర్ శోభిక

సాక్షి,పాడేరు: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యా కమిషన్ (ఎండీఎం) డైరెక్టర్ శోభిక హెచ్చరించారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై క్షేత్రస్థాయి తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆమె పాడేరు ప్రాంతంలో పర్యటించారు. గుడివాడ, కిండంగి.సుండ్రుపుట్టు ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు పాడేరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలోని చిన్నారులు, విద్యార్థులతో మాట్లాడారు. నిత్యావసరాలు, గుడ్లు, చెక్కీళ్లు, రాగిపిండికి సంబంధించి స్టాక్ రిజిస్టర్లను ఆమె పరిశీలించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంతోపాటు పంపిణీ చేసిన కొత్త పాత్రలను వినియోగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజన పథకం నిర్వహణలో లోపాలను గుర్తించిన ఆమె బాధ్యులైన అధికారులు, ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈవో గౌరీశంకరరావు, నూతనంగా నియమితులైన డీఈవో బ్రహ్మాజీరావు, ఏడీ అప్పారావునాయుడు, ఎంఈవో-1 ఎస్.రామచంద్రరావు,ఎంఈవో-2 సీహెచ్.సరస్వతి, డిప్యూటీ డీఈవో చెల్లయ్య, డీపీసీ వెంకటరమణ పాల్గొన్నారు.


విద్యార్థితో మాట్లాడుతున్న పాఠశాల విద్యా కమిషన్ డైరెక్టర్ శోభిక

మహిళా సంక్షేమమే ధ్యేయం


సభకు హాజరైన గ్రామస్తులు


చవిటిదిబ్బలులో మహిళా సంఘాలకు ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

వై.రామవరం: మహిళా సంక్షేమమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని చవిటిదిబ్బలలో ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఆమె మాట్లాడారు. డ్వాక్రా మహిళలు అప్పులను తీరుస్తానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని తమ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలోని, 178 మహిళా సంఘాలకు చెందిన 1673 మంది సభ్యులకు రూ.59 లక్షల, 88వేల, 676ల మేర లబ్ధి చేకూరిందన్నారు. మండలంలో నాలుగు విడతలు కలిసి రూ.2కోట్ల 39లక్షల, 54వేల 704లు ప్రభుత్వం జమ చేసిందన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కును అందజేసారు. మహిళలంతా సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, మండలంలోని సర్పంచ్‌లు, మండల మహిళా సమాఖ్య, గ్రామ సమాఖ్య లీడర్లు, వీబీకేలు, వెలుగు సీసీలు, సిబ్బంది, ఏపీఎం సుధాకర్, డీటీ కె.సుధాకరరావు పాల్గొన్నారు.

అదనపు భవనాలు ప్రారంభం

స్థానిక సీహెచ్‌సీలో రూ.5.65కోట్లతో నిర్మించిన అదనపు భవనాలను శుక్రవారం రాత్రి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్, వైద్యాధికారులు చైతన్య, జీవన్, మధులత, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికి దాడి

- నిందితుడు పరారీ

పెదబయలు: పాఠశాలకు వెళ్తున్న బాలికకు మాయమాటలు చెప్పి ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడినట్టు ఎస్‌ఐ పులి మనోజ్ కుమార్ తెలిపారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదబయలు మండలం అడుగులపుట్టు పంచాయతీ లకేయిపుట్టుకు చెందిన ఏడేళ్ల బాలిక ఈనెల 7వతేదీ ఉదయం ఇంటి నుంచి పాఠశాలకు బయలు దేరింది. అదే గ్రామానికి చెందిన మర్రి సూరిబాబు (22) మార్గంమధ్యలో ఆమెకు మాయ మాటలు చెప్పాడు. ఆమె అక్క చదువుతున్న పాఠశాలకు వెళ్లి చూసి వద్దామని చెప్పి సమీప అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లి లైంగికదాడికి పాల్పడినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఉదయం పాఠశాలకు వెళ్లిన బాలిక ఇంటికి రాకపోవడంతో ఆమెకోసం తల్లిదండ్రులు వెతకుతుండగా బాలిక వద్ద ఉన్న యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం జిల్లా ఆస్పత్రికి పంపించి.. పరారీలో ఉన్న నిందితుడికోసం గాలిస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

గిరిజన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: మండలంలోని గెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీ వచ్చిన రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు ఇవ్వాలని తెలిపారు. పీహెచ్‌సీ ప్రతీ రోజు ఎంత మంది రోగులు వస్తున్నారు, వచ్చిన రోగులకు నిర్వహిస్తున్న పరీక్షలు వివరాలు వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు.వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆస్పత్రులపై రోగులకు మరింతగా నమ్మకాన్ని కలిగించాలన్నారు. అనంతరం గెద్దాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. జాతీయ స్థాయిలో జరిగిన ఎన్ఎంఎం మెరిట్ స్కాలషిప్-2024 పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులను కలెక్టర్ సుమిత్‌కుమార్, పీవో సూరజ్‌గనోరే అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షలో 8వ తరగతి విద్యార్థులు నెరం జ్యోతిమణి, పల్లాల దేవిప్రియాంక, కడబాల జగదీష్‌రెడ్డి, కానెం శ్రావణ్‌రెడ్డిలను గ్రామస్తులు పూలు జల్లుతూ ట్రాక్టర్‌పై ఊరేగించి సంతోషాన్ని చాటుకున్నారు. రంపచోడవరం ఏవో లక్ష్మణరావు ఆయా విద్యార్థులను ప్రోత్సాహించేందుకు సమకూర్చిన జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు, పెన్నులు, అట్టలు, మెమెంటోలను కలెక్టర్, పీవో చేతులు మీదుగా అందజేశారు. ఎంపీపీ బందం శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యుడు జగదీష్ కుంజం, సర్పంచ్ వడగల ప్రసాద్, ఎంఈఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా చదవాలి

ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర


విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉంటూ ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు.మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-2ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం 9, 10 తరగతి విద్యార్థులకు పలు సబ్జెక్టులలో ప్రశ్నలు వేసి, విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో పదో తరగతి ఎంతో ముఖ్యమైన దశ అని, విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించి భవిష్యత్తును ఉత్తమంగా మలుచుకోవాలన్నారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు అంటే భయాన్ని వీడాలని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ప్రతి సబ్జెక్టులో పట్టు సాధించాలన్నారు. ఆమె వెంట ఎంపీడీవో కిరణ్‌కుమార్, హెచ్ఎంలు ప్రకాశ్, రాధాకృష్ణ, వార్డెన్ రత్నకుమారి, ఉపాధ్యాయులున్నారు.

కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం


బీమా పత్రాలను అందజేస్తున్న సహాయక కార్మిక అధికారి సూర్యనారాయణ

సాక్షి,పాడేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన కార్మికశాఖ ఆధ్వర్యంలో పేదలకు ఈ-శ్రమ్ కార్డు ద్వారా రూ.2లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని ఉచితంగా ఆమలుజేస్తోందని, జిల్లా సహాయక కార్మిక అధికారి సూర్యనారాయణ అన్నారు. హుకుంపేట, పెదబయలు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన నలుగురు గిరిజనులు ప్రమాదాలకు గురై మృతి చెందారు. వారంతా ఈ-శ్రమ్ కార్డులను అప్పటిలో నమోదు చేసుకోవడంతో రూ.2లక్షల చొప్పున ప్రమాద బీమా సొమ్ము మంజూరైంది. మృతుల కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో బీమా సొమ్ము జమకావడంతో వాటికి సంబంధించిన మంజూరు పత్రాలను శుక్రవారం ఐటీడీఏ ఆవరణలో బాధిత కుటుంబాలకు అందజేశారు.ఈ సందర్భంగా అధికారి సూర్యనారాయణ మాట్లాడుతూ కార్మికులతో పాటు వ్యవసాయ కూలీలు,పేదలంతా గ్రామ సచివాలయాల్లో ఈ-శ్రమ్ కార్డులను నమోదు చేసుకోవాలన్నారు.ఈ-శ్రమ్ కార్డులు పొందిన వారు ప్రమాదవశాత్తు మృతిచెందితే వెంటనే తమ కార్మికశాఖకు సమాచారం అందజేయాలని సూచించారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు


అనంతగిరిలో దట్టంగా కమ్ముకున్న పొగమంచు


పొగమంచులో లైట్లు వేసుకుని ప్రయాణం సాగిస్తున్న వాహనచోదకులు

తగ్గుముఖం పట్టని పొగమంచు

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా పొగమంచు అర్ధ రాత్రి నుంచి ఉదయం 9గంటల వరకు దట్టంగా కురుస్తోంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 15డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 16.8డిగ్రీలు,చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 17.5డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు శుక్రవారం నమోదయ్యాయి. మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండతీవ్రత నెలకొంది. సాయంత్రం నుంచి మబ్బు వాతావరణం నెలకొంది.

అనంతగిరి: మండల కేంద్రం అనంతగిరిలో శుక్రవారం సాయంత్రం పొగమంచు దట్టంగా కమ్ముకుంది. దీంతో వాహన చోదకులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. గత రెండు రోజులుగా అనంతగిరి, ములియగుడ, డముకు ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకుంటోందని స్థానికులు తెలిపారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి


విజేతలతో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్, ఎస్ఐ రవీంద్ర, పోలీసులు

ముంచంగిపుట్టు: గిరి యువత లక్ష్యాన్ని ఏర్పరచుకొని, సాధనకు కృషి చేయాలని సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్ అన్నారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో శుక్రవారం సీఆర్‌పీఎఫ్198 బెటాలియన్ కమాండెంట్ రాజేష్ పాండే ఆదేశాల మేరకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మండలంలోని జర్జుల, వనభసింగి పంచాయతీల నుంచి జట్లు పాల్గొన్నాయి. విజేతలకు సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాజ్‌కుమార్, ఎస్ఐ రవీంద్ర చేతుల మీదుగా బహుమతులు, వాలీబాల్ కిట్లు, టీ-షర్టులు అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన యువతలో అపారమైన ప్రతిభా ఉందని వాటిని వెలికితీసేందుకు పోలీసు శాఖ ఎప్పుడు ముందుంటుందన్నారు. గిరి యువత ప్రతిభ జిల్లా, రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిల వరకు ఎదిగేలా ప్రతిభా నైపుణ్యాన్ని చాటాలన్నారు. ప్రభుత్వం గిరిజన యువత అభ్యున్నతి కోసం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వనభసింగి సర్పంచ్ లక్ష్మణ్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు బోడిదొర తరలింపు

ఆయన ఆరోగ్యంపై దృష్టి సారించిన కలెక్టర్ సుమిత్‌కుమార్


నర్సీపట్నం ఆస్పత్రిలో బోడిదొరతో ఎంపీడీవో సీతయ్య

కొయ్యూరు: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు గాం మల్లుదొర మనువడు బోడిదొర ఆరోగ్యంపై కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఆదేశాల మేరకు ఎంపీడీవో లాలం సీతయ్య శుక్రవారం బోడిదొర స్వగ్రామం లంకవీధి వెళ్లారు. అక్కడి నుంచి ఆయనను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం అతనిని నేరుగా ఏఎన్ఎం, ఆశా కార్యకర్త సాయంతో కేజీహెచ్‌కు పంపించారు. బోడిదొరకు రూ.5 వేల నగదు సాయాన్ని కలెక్టర్ అందించారు. అతను కోలుకున్న తరువాత ఆయనకు అవసరమైన నిత్యావసరాలను ప్రభుత్వం తరపున అందించనున్నారు. ప్రస్తుం ఉంటున్న ఇంట్లో ఉండేందుకు ఇష్టం లేకుంటే తాత్కాలిక గృహాన్ని నిర్మిస్తామని కలెక్టర్ చెప్పారని ఎంపీడీవో తెలిపారు. ఆస్పత్రిని డిశ్చార్జి అనంతరం బోడిదొర ఇంటికి వచ్చిన తరువాత పరిస్థితిని పర్యవేక్షించాలని తన తోపాటు గిరిజన సంక్షేమ శాఖ ఏఈని కలెక్టర్ ఆదేశించారని ఎంపీడీవో పేర్కొన్నారు.

పోలవరం నిర్వాసితుల వినతి


సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

దేవీపట్నం: పోలవరం ముంపు గ్రామమైన కె.గొందూరులో దాదాపు 33 ఎకరాల భూమికి నష్టపరిహారం, భూమికి భూమి ఇవ్వలేదని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు నిర్వాసితులు విన్నవించారు. ఇందుకూరుపేట తహసీల్దార్ కార్యాలయానికి శుక్రవారం వచ్చిన కలెక్టర్‌ను వారు కలిశారు. దీనిపై స్పందించిన ఆయన పది రోజుల్లో సమస్య పరిష్కరించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై బీఎల్వోలు, సెక్టార్ అధికారులతో ఆయన సమీక్షించారు. సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, దేవీపట్నం తహసీల్దార్ చలపతిరావు, డీటీ రామకృష్ణ పాల్గొన్నారు.

కనులపండువగా తెప్పోత్సవం



సింహాచలం : పుష్య బహుళ అమావాస్యను పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం శుక్రవారం రాత్రి కనులపండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతుడై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వేణు గోపాలస్వామిగా ఈ ఉత్సవంలో దర్శనమిచ్చాడు. హంస వాహనంపై నౌకావిహారంలో కనువిందు చేశాడు. ఉత్సవాన్ని కనులారా తిలకించి భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో వరాహపుష్కరిణి అంతా కిటకిటలాడింది.

జూనియర్ కళాశాలగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల అప్‌గ్రేడ్

- జూన్ నుంచి తరగతులు ప్రారంభం
- ఎంపీపీ బడుగు రమేష్ వెల్లడి


ఎంపీపీ రమేష్

కొయ్యూరు: కొయ్యూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడంతో ఏళ్ల నాటి కల నెరవేరిందని ఎంపీపీ బడుగు రమేష్ అన్నారు.ఆయన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు గత టీడీపీ పాలకులకు పలుమార్లు వినతులిచ్చినా పట్టించుకోలేదని గుర్తు చేశారు. సీఎం జగనన్న పాలనలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎంపీ మాధవిల చొరవతో కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ కళాశాల రానుండడంతో కో-ఎడ్యుకేషన్ కొనసాగుతుందన్నారు. రానున్న జూన్ నుంచి తరగతులు ప్రారంభిస్తారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన సీఎం జగనన్నకు, ఎంపీ, ఎమ్మెల్యేలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.